క్లుప్తంగా

నేడు కొండపిలో పొగాకు వేలం కేంద్రం ప్రారంభం

కొండపి (మర్రిపూడి): కొండపి పొగాకు బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ ఉదయం 8 గంటలకు పూజా కార్యక్రమంతో వేలం కేంద్రం ప్రారంభమవుతుందని పొగాకు బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. 9 గంటలకు పొగాకు బేళ్ల కాటా వేయడం జరుగుతుందని, 9.20 గంటలకు వేలం ప్రారంభిస్తామని, మొదటిరోజు జువ్విగుంట గ్రామానికి చెందిన 18 బేళ్లకు అనుమతివ్వడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పొగాకు రైతులు, రైతు ప్రతినిధులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలేరమ్మ దేవాలయంలో నేడు బహిరంగ వేలం

జరుగుమల్లి: మండల పరిధిలోని కామేపల్లి పోలేరమ్మ దేవాలయంలో ఏడాది కాలానికి పలురకాల హక్కులకు నేడు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవాలయ ఈఓ రావెళ్ల శివశంకర్ తెలిపారు. దేవాలయ ముందు భాగంలో టెంకాయలు, పూజా సామగ్రి, నిత్యావసర సరుకులు, సప్లయి సామగ్రి అద్దెకిచ్చుకునే హక్కు, క్యాంటిన్ నడుపుకునే హక్కు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునే హక్కు, తలనీలాలు పోగుచేసుకునే హక్కు, చీరలు, రవికలు పోగుచేసుకునే హక్కు, మరుగుదొడ్ల నిర్వహణకు తేదీ 01-04-2024 నుంచి 31-03-2025 వరకు హక్కులకు గురువారం ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో దేవాదాయ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు తగిన ధరావతు చెల్లించాలని ఈఓ సూచించారు.

ఘనంగా జంటనాగుల ప్రతిష్ఠ


జంటనాగేంద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొండపి (మర్రిపూడి): కొండపి మండలం వెన్నూరు గ్రామంలో జంట నాగేంద్రుల ఆలయ 14వ వార్షికోత్సవాన్ని బుధవారం రెండోరోజు ఘనంగా నిర్వహించారు. నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ధర్మకర్తలు మహంకాళి వెంకట శేషయ్య, అర్చకులు భారతుల శ్రీను, మురళీకృష్ణ, ఎం.హరి, ఎస్.శివకుమార్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.72 లక్షలు


ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

సింగరాయకొండ (మర్రిపూడి): సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. గత సంవత్సరం అక్టోబర్ 20 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీ వరకు జరిగిన హుండీ లెక్కింపులో ఆలయానికి 2,72,648 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈఓ పి.కృష్ణవేణి తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి విరాళం


విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

కందుకూరు: కనిగిరి రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవస్థాన ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవానికి దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా అనంతసాగరం గ్రామానికి చెందిన బైరపనేని శ్రీనివాసరావు, ధనమ్మ దంపతులు రూ.25,000 విరాళాన్ని అందజేశారు. సంఘం సభ్యులు ఇస్కాల వెంకట నరశింహ, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

పీసీపల్లి: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని చింతగుంపల్లి గ్రామస్తులు ఎంపీడీఓ రమణారెడ్డికి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. చింతగుంపల్లి గ్రామంలో ఉన్న ఒక్క డీప్ బోర్ మరమ్మతులకు గురైందని పంచాయతీ కార్యదర్శి విశ్వరూపాచారికి ఫిర్యాదు చేసి 20 రోజులు దాటుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్ర కిట్లను క్రీడాకారులకు పంపిణీ చేయకుండా అమ్ముకున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీకి అన్ని వార్డుల్లో మెజార్టీ రావాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్


మాట్లాడుతున్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, పక్కన చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా పనిచేద్దాం.. పట్టణంలోని ప్రతి వార్డులో వైఎస్సార్ సీపీకి మెజార్టీ తీసుకువద్దాం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులోని చైర్మన్ అబ్దుల్ గఫార్ చాంబర్‌లో కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయన్నారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించి.. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసే విధంగా చైతన్యవంతులను చేయాలన్నారు. ప్రతి ఇంట్లో రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని వివరించాలన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వందేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్‌లు పులి శాంతి, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు శ్రీరాం సతీష్, దేవకి రాజీవ్, దేవరాజ్, ఎస్‌కే కరీమున్నిసా, పులి విజలక్ష్మీ, నక్కా ఉమాదేవి, చొప్పరపు మాధవి, పి.దీప, ఎస్‌కే సాహెరా, ఎస్‌కే ఖాజా, చింతం శ్రీను, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళీ, మార్తల వెంకటేశ్వరరెడ్డి, కటికల వెంకట రత్నం, సిరుప గోవర్ధన్‌రెడ్డి, పులి శ్రీను, పి ఆరుణోధర్, రామనబోయిన శ్రీను, తిరుపతయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం


వెలిగండ్లలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దద్దాల నారాయణ

వెలిగండ్ల: మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ, జెడ్పీటీసీ గుంటక తిరుపతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో కార్యాలయాన్ని ప్రారంభించడం శుభ పరిణామన్నారు. రానున్న ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతరెడ్డి, వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్, సింగిల్ ఇండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ నాగూర్ యాదవ్, కటికల వెంకటరత్నం, జేసీఎస్ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ ఎలిక నారాయణ, గాలి తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, క్రిష్టారెడ్డి, ఎంపీటీసీలు జనార్దన్, నాయకులు వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యులు ఆమీద్, వెంకటనారాయణ, ఆదినారాయణ, చైర్మన్ దాదా లక్ష్మీకుమారి ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ గతంలో రోజుకు పట్టణంలోని 450 ట్రిప్పులు నీళ్ల ట్యాంకర్ల ద్వార తరలించే వాళ్లమని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. దాన్ని రోజుకు 55 నుంచి 75 ట్రిప్పులకు పరిమితం చేసినట్లు వెల్లడించారు. పట్టణంలోని మోడల్ స్కూల్ రోడ్డు పనులకు రూ.2.5 లక్షలు మంజరయ్యాయని, తక్షణం వాటి పనులు ప్రారంభించాలని ఏఈ కోటేశ్వరరావును ఆదేశించారు. దశల వారీగా పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. జేజేఎం కింద మంజూరైన పనులను తక్షణ ప్రారంభించాలని ఏఈని ఆదేశించారు. డబుల్ రోడ్డు పనులు శంఖవరం నుంచి శ్రీరంగాపురం వరకు చేపట్టాలని అధికారులకు విన్నవించినట్లు చెప్పారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌కు 20 మంది కార్మికులతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని శానిటరి ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవను ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధి తదితర అంశాల గురించి వివరించారు. కౌన్సిలర్ శ్రీరాం సతీష్ మాట్లాడుతూ పట్టణంలోని నీటి సమస్య తీవ్రతగా ఉన్నందున శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అడగ్గా.. తక్షణ ప్రణాళికా చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు


కేజీబీవీ సిబ్బందితో మాట్లాడుతున్న జీసీడీఓ ప్రమోద

సీఎస్‌పురం(పామూరు): కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సమగ్రశిక్ష జీసీడీఓ ఎ.ప్రమోద హెచ్చరించారు. స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని బుధవారం జీసీడీఓ, ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డిలతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించి 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై విచారించారు. ఎప్పుడైనా బాలికలను తల్లిదండ్రులతో తప్ప మరెవరితోనైనా బయటకు పంపినట్లు తెలిస్తే బాధ్యులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. సీఎస్‌పురం కేజీబీవీ సిబ్బందిలో సమన్వయలోపం ఉందని, ఇదే తీరును వ్యవహరిస్తే కొందరి సిబ్బందిపై వేటు వేస్తామన్నారు. విద్యార్థినులకు చదువు చెప్పాల్సిన బోధకులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఇలాంటి చర్యలు తగవన్నారు. గత కొద్ది రోజులుగా సీఎస్‌పురం కేజీబీవీ పనితీరుపై వరుస ఫిర్యాదులు వస్తున్నాయని, ఇదేపరిస్థితి కొనసాగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. రానున్న ఇంటర్మీడియెట్, పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థినులను సన్నద్ధం చేయాలని, పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ షేక్.రేష్మ, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్‌గా డానియల్ బాధ్యతలు స్వీకరణ

వెలిగండ్ల: తహసీల్దార్‌గా ఎం డానియల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు రూరల్‌లో పనిచేస్తూ బదిలీపై వెలిగండ్ల మండలానికి వచ్చారు.

దాతల చేయూత అభినందనీయం


వేంపాడులో విద్యార్థులకు పలకలు అందజేస్తున్న దాతలు

పొన్నలూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల చేయూత అభినందనీయమని హెచ్‌ఎం ఖాదర్‌బాషా అన్నారు. మండలంలోని వేంపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత పోలిశెట్టి సోమసుందరం పొగాకు కంపెనీ వారు రూ.5 వేలు విలువచేసి పలకలు, అట్టలు, నోట్ పుస్తకాలు, పెన్నులను బుధవారం ఉచితంగా బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దాతల చేయూతను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో రవి, సోమసుందరం పొగాకు కంపెనీ ప్రతినిధి రామాంజనేయులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ అధికారులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషోర్‌రెడ్డి

హనుమంతునిపాడు: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండాలని తహసీల్దార్ కిషోర్‌రెడ్డి బూత్ లెవల్ అధికారులకు సూచించారు. పోలింగ్ బూత్ లెవల్ అధికారులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఫొటోలు, ఓటర్ల పేర్లు, ఇంటిపేర్లు, అడ్రస్ తప్పులు ఉంటే సవరణలు చేయించాలన్నారు. 80 ఏళ్ల పైబడి పోలింగ్ కేంద్రాలకు వెళ్ల లేని వారికి ఇంటి వద్దే ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించారన్నారు. ఓటు హక్కు నమోదుకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. బూత్ లెవల్ ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పిదాలు లేకుండా చూసుకోవాలన్నారు.

పీసీపల్లి: బూత్‌లెవల్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తహసీల్దార్ పద్మావతి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క బూత్‌లెవల్ అధికారి ఒకటికి పలుమార్లు ఓటర్ల జాబితాను పరిశీలించి మార్పులు చేర్పులు ఉంటే తెలియజేయాలన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత


విద్యార్థులకు ప్యాడ్‌లు, పరీక్షా సామగ్రిని అందజేస్తున్న ఎస్సై, దాత

పామూరు: స్థానిక కేజీబీవీలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతూ వార్షిక పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థినులకు దాతలు ప్యాడ్స్, పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈసందర్భంగా బుధవారం కేజీబీవీలో ఎస్‌ఓ కటకం సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు దాత దూబగుంట్ల సర్పంచ్, వైఎస్సార్ సీపీ రైతువిభాగం మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాసులు సమకూర్చిన పరీక్షా సామగ్రి ప్యాడ్స్, జామెంట్రీ, పెన్స్, పెన్సిల్‌తో పాటు మరికొన్ని మొత్తం 50 మందికి ఎస్సై ఎం సైదుబాబు చేతుల మీదుగా విద్యార్థులకు దాత శ్రీనివాసరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సైదుబాబు మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు పేదల విద్యార్థులకు వరం లాంటివన్నారు. దాతకు అభినందనలు తెలిపారు. డాక్టర్ షేక్.నాయబ్ రసూల్, కందుల శ్రీనివాసరెడ్డి, రేగులగడ్డ నాగరాజు, పేరం రఘునాథరెడ్డి, ఏఓ వాణి, మండ్లా శైలజ, జయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు


చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టైలర్స్ యూనియన్ నాయకులు

కనిగిరి రూరల్: టైలర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గార్లపేట రోడ్డులో ఉన్న స్వర్ణ ప్యాలెస్ వద్ద, నాజ్ సెంటర్‌లో జెండా ఆవిష్కరణ చేసి ఏలియోస్ హోవే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గార్లపేట రోడ్డులోని ఏబీ సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌లో మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు నిర్వహించారు. అనంతరం దర్జీలకు బియ్యం పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసీన్, ఏబీ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ చైతన్య, రసూల్, బేరి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్డీఓ

కనిగిరి రూరల్: రాష్ట్రస్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో పలుచోట్ల విజేతలుగా నిలిచిన కనిగిరి ఖోఖో క్రీడాకారులను బుధవారం ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ మాట్లాడుతూ కనిగిరి ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో నిలిపిన క్రీడాకారుల ప్రతిభను కొనియాడారు. ప్రభుత్వం దత్తత తీసుకున్న ఖోఖో క్రీడాకారిణి కె.ఇల్లూరి హైమావతి క్రీడా లక్ష్యాన్ని కొనియాడారు. ఖోఖో క్రీడా సంఘ జిల్లా కార్యదర్శి బి.కాశీ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 27 వరకు తూర్పుగోదావరి జిల్లా సామర్ల కోటలో జరిగిన 56వ రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల ఖోఖో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ప్రాతినిధ్యం వహించిన కనిగిరి ఎమ్మెస్సార్, ఎంఎస్‌ఎం విద్యార్థినులు ప్రథమస్థానంలో నిలిచారన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో కనిగిరి నియోజకవర్గ జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతిని, అవార్డును తీసుకున్నారు. ఆ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కుమారి ఇల్లూరి హైమావతిని రాష్ట్ర ప్రభుత్వం దత్తత తీసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీడీ వై శ్రీనివాస్‌రెడ్డి, హాజరత్‌రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత పెంపు


పామూరులో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేజీబివి ఉపాధ్యాయులు


సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్ ఉపాధ్యాయుని సన్మానిస్తున్న హెచ్‌యం, ఉపాధ్యాయులు


హనుమంతునిపాడులో మాట్లాడుతున్న హెచ్‌ఎం సురేష్‌బాబు


పెంట్రాలలో విద్యార్థుల ప్రదర్శనలు

పామూరు: విద్యార్థుల్లోని విద్య, వైజ్ఞానిక శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని కేజీబీవీ ఎస్‌ఓ కటకం సజన అన్నారు. సైన్స్ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంతో పాటు పలు ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల్లో ఆలోచన రేకెత్తించాయి. ఈ సందర్భంగా కేజీబీవి ఎస్‌ఓ సజన మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. తరగతి గదుల్లో చెప్పే సైన్స్‌లోని అంశాలను విద్యార్థులతో ప్రయాగాలు చేయించేందుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. శైలజ, ఏఓ ఈవీ నాగవాణి, జయలక్ష్మి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): సైన్స్ దినోత్సవాన్ని సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్‌తో పాటు మండలంలోని శీలంవారిపల్లె జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించారు. శీలంవారిపల్లె జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్ పాఠశాలలో హెచ్‌ఎం నాగినేని తిరుపతయ్య సైన్స్‌డేపై విద్యార్థులకు వివరించారు. సీఎస్‌పురం హెచ్‌యం షేక్.ఖాదరున్నీసాబేగం, నాగినేని తిరుపతయ్యలు మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మానవాళి మనుగడకు సైన్స్ ఉపయోగం

లింగసముద్రం: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పెంట్రాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ సైన్స్ అనేక రకాలుగా అభివృద్ధి చెందుతూ మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలు ప్రదర్శించారు. కాంప్లెక్స్ సెక్రటరీ సుధాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ యు.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సులోచన ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. నెల్లూరు జిల్లాలో జరిగిన ఇన్‌స్పైర్ ప్రదర్శనలో ఆరో స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైన ధనుష్‌గుప్తా.. గైడ్ టీచర్ కాపులూరి వెంకటేశ్వర్లును అభినందించారు. సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతను, ప్రభుత్వ సేవలు, రక్షణ, వ్యవసాయం, విద్యా, వైద్య రంగాల్లో వినియోగాన్ని తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఎన్‌వి.శ్రీహరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీనివాసరావు

ఉలవపాడు: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కరేడు వైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియోపై బుధవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఐదేళ్లలోపు పిల్లలందరినీ గుర్తించి ఈ నెల 3,4,5 తేదీల్లో పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. 25 పోలియో చుక్కలు వేసే కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, మొబైల్ కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

ఘనంగా దర్జీల దినోత్సవం


ఉలవపాడులో సీనియర్ దర్జీలను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఉలవపాడు: ఉలవపాడులో బుధవారం దర్జీల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వక్తలు మండల కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, మాజీ జెడ్పీటీసీ కోటిలింగం, సుబ్బారెడ్డి దర్జీల వృత్తి గురించి కొనియాడారు. విలియం హార్వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీనియర్ దర్జీలను సన్మానించారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షిక వేడుకలు

ఉలవపాడు: స్థానిక జీవీఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన లేకుండా విద్యను అభ్యసించి పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందచేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వైఎస్సార్ సీపీ కార్యకర్తల మృతికి మంత్రి సురేష్ నివాళులు


మేడిద పెదశింగయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

కొండపి (మర్రిపూడి): కొండపి ఎస్సీకాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మేడిద పెదశింగయ్య, పల్లె పెదబ్రహ్మయ్య బుధవారం అనారోగ్య కారణాలతో మరణించారు. వీరి మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ వీరి మృతి పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వెంట పార్టీమండలఅధ్యక్షుడుఆరికట్ల కోటిలింగం,నాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా గుర్తించిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అడిగిన ప్రతి కూలికి పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనన్నారు. ఉద్యానవన పంటలు సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా మేట్ల సహకారంతో పనులు చేయించాలన్నారు.

నేడు జన ఔషధి కేంద్రం ప్రారంభం

పామూరు: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు రోడ్డులో గురువారం ఉదయం 10 గంటలకు భారతీయ జన ఔషధి కేంద్రం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, హాజరవుతారన్నారు.

ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓలు ప్రసాదరావు, రమణయ్య తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం దారిద్ర రేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అనాథలు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు 25 శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. వీరు మార్చి 14 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.